క్లుప్తంగా

హరికిషన్ సింగ్ సూర్జిత్‌కు ఘన నివాళి



హరికిషన్ సింగ్ సూర్జిత్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం ప్రతినిధులు

కాకినాడ సిటీ: స్వాతంత్య్ర సమరయోధుడు, సీపీఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శిగా పని చేసిన హరికిషన్ సింగ్ సూర్జిత్ 16వ వర్ధంతి సందర్భంగా గురువారం కాకినాడ సుందరయ్య భవన్‌లో సీపీఎం నాయకులు పాల్గొని నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పలివెల వీరబాబు, ఎం.రాజశేఖర్, దువ్వా శేషుబాబ్జీ, ఎం.రాజశేఖర్‌లు సూర్జిత్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. 14 ఏళ్ల వయసులో బ్రిటీష్ జాక్‌ని దించేసి, జాతీయ జెండా ఎగురవేసిన సాహసవంతుడు సూర్జిత్ అని కొనియాడారు. స్వాతంత్య్ర పోరాటంలో జైలు శిక్షకు భయపడలేదన్నారు. ఆలిండియా కిసాన్ సభ నిర్మాణంలో కీలకపాత్ర పోషించారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర కమిటీ సభ్యులు కె.సత్తిరాజు, మలక వెంకటరమణ, దుంపల ప్రసాద్, సూరిబాబులతో పాటు వెంకటరావు, సీహెచ్ రమణి, సత్యనారాయణ, రాజేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా పింఛన్ల పంపిణీ



తిమ్మాపురంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నానాజీ

కాకినాడ రూరల్: కాకినాడ రూరల్ మండలంలో గురువారం రాత్రి 8.30 గంటల వరకు 96.44 శాతం మందికి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలో మొత్తం 18,294 మంది లబ్ధిదారులకు తొలి రోజు 17,642 మందికి రూ.7.38కోట్లు పంపిణీ చేశారు. తిమ్మాపురంలో ఎమ్మెల్యే పంతం నానాజీ పింఛన్లు పంపిణీ చేయగా, వాకలపూడి, వలసపాకల తదితర గ్రామాల్లో టీడీపీ నేతలు, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి పంపిణీలో పాల్గొన్నారు. నూరు శాతం పంపిణీ లక్ష్యంగా సచివాలయ సిబ్బంది పనిచేస్తున్నారని, ఎంపీడీఓ రమేష్‌నాయుడు తెలిపారు.

కరపలో 96.4 శాతం..



గొర్రిపూడిలో పింఛన్ పంపిణీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ అప్పారావు

కరప: మండల పరిధిలో గురువారం సాయంత్రానికి 96.4 శాతం పింఛన్ల పంపిణీ జరిగిందని ఎంపీడీఓ కె.అప్పారావు తెలిపారు. మండలంలోని 23 గ్రామ పంచాయతీల పరిధిలో పింఛన్‌దారులు 11,526 మంది ఉండగా రూ.4,81,86,000 ఇవ్వాల్సి ఉందన్నారు. వీరిలో 11,111 మంది లబ్ధిదారులకు రూ.4,64,35,000 గ్రామ సచివాలయం సిబ్బంది, వీఆర్వోలు తదితర ప్రభుత్వోద్యోగులు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్ ఇచ్చారన్నారు.

దానం చందంగా పింఛన్ల పంపిణీ తగదు

బోట్‌క్లబ్: సామాజిక పింఛన్ల పంపిణీని ప్రభుత్వ ఉద్యోగి ద్వారా మాత్రమే గౌరవప్రదంగా అందించాలని పౌర సంక్షేమ కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు గురువారం ఒక ప్రకటనలో కోరారు. లబ్ధిదారులకు పింఛన్లు ఇస్తున్నట్టు తీస్తున్న ఫొటోలను ప్రభుత్వ రికార్డులకు మాత్రమే పరిమితం చేయాలన్నారు. ప్రస్తుతం నడి రోడ్డుపై లబ్ధిదారుని నిలబెట్టి దానం ఇస్తున్నట్టు సెల్ఫీలు తీసి సామాజిక మాధ్యమాల్లో పెట్టడం రాజకీయ పైత్యమేనన్నారు.

ఫొటో ఎగ్జిబిషన్ పోటీల్లో భాగస్వాములు కండి

పెద్దాపురం: నేచురల్ ఫొటో ఎగ్జిబిషన్ పోటీల్లో ప్రతి విద్యార్థి భాగస్వాములు కావాలని పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ (పీసీసీ) గౌరవాధ్యక్షుడు బుద్ధా శ్రీనివాస్, ది పెద్దాపురం ప్రొఫెషనల్ ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్షుడు వరహాలరాజు అన్నారు. ఈ నెల 19వ తేదీన ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా గురువారం పోటీల వాల్‌పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఈ పోటీలను ఏర్పాటు చేశామన్నారు. 6,7 తరగతి విద్యార్థులు జూనియర్స్ విభాగంలోనూ, 8, 9, 10 తరగతుల వారు సీనియర్స్ విభాగంలో పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. తీసిన ఫొటోలు 79016 97939 నెంబర్‌కు డ్యాక్యుమెంట్ ఫైల్‌లో 12వ తేదీలోగా పంపించాలని కోరారు. కార్యక్రమంలో సాహితి స్రవంతి గౌరవాధ్యక్షులు చల్లా విశ్వనాథం, పీసీసీ అధ్యక్ష, కార్యదర్శులు కూనిరెడ్డి అరుణ, రొంగల అరుణ్‌కుమార్, నేహా, బంగారం, ఫొటో యూనియన్ నాయకులు రమణ, సతీష్, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● వాన చుక్కకు వర్ణ ఛత్రం



రంగరాయ వైద్య కళాశాల వద్ద విక్రయానికి ఉంచిన రంగురంగుల గొడుగులు

బోట్‌క్లబ్: వర్షాకాలం రావడంతో నగరంలో పలు ప్రాంతాల్లో రకరకాలు గొడుగులు విక్రయిస్తున్నారు. పాఠశాలకు వెళ్లే చిన్నారులకు సైతం చిన్న గొడుగులు అందుబాటులోని రావడంతో ప్రజలు వీటికి కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. చేతితో పట్టుకొనకుండా తలపై పెట్టుకొనే విధంగా ఉన్న ఎలాస్టిక్ గొడుగులు విక్రయిస్తున్నారు. స్థానిక సర్పవరం జంక్షన్ మొదలు జగన్నాథపురం వరకూ సుమారు 10కి పైగా రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన తాత్కాలిక దుకాణాల్లో వీటిని విక్రయిస్తున్నారు. వివిధ రంగులు, మోడళ్లలో లభించడంతో ప్రజలు వీటిని కొనుగోలు చేస్తున్నారు. మహిళలు వర్షాకాలంలో తమ హ్యాండ్‌బ్యాగ్‌లో పెట్టుకొనే గొడుగులు సైతం ఇక్కడ విక్రయిస్తున్నారు. ప్రస్తుత వర్షాకాలం కావడంతో వీటి అవసరం ప్రతీ ఒక్కరికీ ఉంటుందని అందుకే వీటిని హోల్‌సేల్‌గా తీసుకొని వచ్చి విక్రయిస్తున్నట్లు వ్యాపారులు తెలిపారు.

ఎయిడ్స్ నియంత్రణపై క్విజ్ పోటీలు



క్విజ్ పోటీలకు హాజరైన విద్యార్థులతో డీఎంహెచ్‌వో, వైద్య, ఆరోగ్య బృందం

కాకినాడ క్రైం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాలతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో 8, 9 10వ తరగతి విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. హెచ్ఐవీ/ఎయిడ్స్, ఎస్‌టీఐ, ఆర్‌టీఐ, జనరల్ హెల్త్ అంశాలపై డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్ పర్యవేక్షణలో ఈ పోటీలు జరిగాయి. వివిధ రౌండ్లలో ఉత్కంఠ భరితంగా సాగిన ఈ క్విజ్ పోటీలలో ఎంజీఎంసీ ఉన్నత పాఠశాల గాంధీనగర్–కాకినాడ విద్యార్థులు తొలిస్థానంలో నిలిచి రూ.5 వేల నగదు బహుమతికి ఎంపికయ్యారు. రమణయ్యపేటకు చెందిన మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రెండవ స్థానంలో నిలిచి రూ.4 వేల నగదు బహుమతికి అర్హులయ్యారు. అలాగే, జగన్నాథపురానికి చెందిన బీఆర్ఎంసీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు తృతీయ స్థానం సాధించి రూ.3 వేల నగదు బహుమతి సాధించారు. విజేతలు ఈ నెల 15వ తేదీన స్వాతంత్య్ర దినోత్సవం నాడు నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో డీఎంహెచ్‌వో, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ టీబీ నియంత్రణాధికారి చేతుల మీదుగా బహుమానాలు అందుకోనున్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్ గురువారం విజేతలకు ప్రశంసా పత్రాలు అందించి అభినందనలు తెలిపారు.

వెంకయ్యనాయుడి జీవిత చరిత్ర పుస్తకాల అందజేత



వెంకయ్యనాయుడి జీవిత చరిత్ర పుస్తకాన్ని అందిస్తున్న బీజేపీ నాయకులు

బోట్‌క్లబ్: మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడి జీవిత చరిత్ర పుస్తకాన్ని గురువారం జేఎన్టీయూకేలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గ్రంథాలయానికి అందించారు. పుస్తక ఆవిష్కరణ అనంతరం దేశంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలతో పాటు గ్రంథాలయాలు, పాఠ శాలలకు పుస్తకాలు అందించాలని వెంకయ్యనాయుడి స్నేహితులు పైడా కృష్ణమోహన్ చెప్పడంతో బీజేపీ నాయకులు శ్రీనివాసు, వి.ఎస్.ప్రకాశరావు అందించారు. ఢిల్లీ నుంచి పుస్తకాలు రావడంతో నగరంలోని గ్రంథాలయాలు, కళాశాలలు, యూనివర్సిటీకి వీటిని చేర్చారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి దొరస్వామి, అసిస్టెంట్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చేసిన సేవలే సంతృప్తినిస్తాయి

ఆర్డీవో కిశోర్



పదవీ విరమణ చేసిన వరహాలయ్యను సత్కరిస్తున్న ఆర్డీవో కిశోర్, కార్యాలయ సిబ్బంది

కాకినాడ సిటీ: స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయం పరిపాలనాధికారిగా పని చేసి పదవీ విరమణ పొందిన గోగుల వరహాలయ్యను గురువారం ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో ఇట్ల కిషోర్, కార్యాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఆర్డీవో మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో 41 ఏళ్లపాటు సుదీర్ఘ సేవలందించిన వరహాలయ్య నేటి రెవెన్యూ ఉద్యోగులకు ఆదర్శప్రాయులన్నారు. ఉద్యోగికి విధి నిర్వహణలో చేసిన సేవలే సంతృప్తినిస్తాయని వరహాలయ్య సేవలను కొనియాడారు. అనంతరం ఆయనను సత్కరించి, జ్ఞాపికను అందించారు. కార్యాలయ సిబ్బంది సౌజన్య, చందన రాజు, నాగేశ్వరరావు, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించండి

- కార్మికుల హాజరుపై కమిషనర్ ఆరా
- ఉదయం 5.30 గంటలకు మస్టర్ కేంద్రాల సందర్శన



మస్టర్ కేంద్రాల వద్ద సిబ్బందికి సూచనలు ఇస్తున్న కమిషనర్ భావన

కాకినాడ: పారిశుధ్య కార్మికులు సకాలంలో విధులకు హాజరవుతున్నారా? ఎన్ని గంటల వరకు విధులు నిర్వర్తిస్తున్నారు? ఏమైనా సమస్యలు ఉన్నాయా? చెత్త సేకరణకు సంబంధించి ఏమైనా లోపాలు ఉన్నాయా? అంటూ నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఆరా తీశారు. గురువారం ఉదయం 5:30 గంటలకే ఆమె మస్టర్ కేంద్రాలకు వెళ్లి రికార్డులను తనిఖీ చేశారు. పదో సర్కిల్ పరిధిలోని చిన్న మార్కెట్ ప్రాంతంలో ఉన్న మస్టర్ కేంద్రం వద్ద రికార్డుల పరిశీలన అనంతరం పారిశుధ్య కార్మికులతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించి సకాలంలో విధులకు హాజరై మెరుగైన పనితీరు కనబరచాలని కోరారు. కార్మికులకు ఎటువంటి ఇబ్బందులు, సమస్యలు ఉన్నా తన దృష్టికి నేరుగా తీసుకురావచ్చని వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని కమిషనర్ వీరికి హామీ ఇచ్చారు. ఇంటింటికీ చెత్త సేకరణ తడి–పొడి చెత్త సేకరణపై ఆమె ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీ చరణ్‌కు సూచనలు ఇచ్చారు. కార్మికులు మరింత సమర్థవంతంగా పనిచేసేలా.. ప్రజలకు మెరుగైన సేవలు అందించే ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని ఆమె ఆదేశించారు. ప్రజలు కూడా చెత్తను రోడ్ల పైన, డ్రైనేజీలలోను వేయకుండా ఇళ్ల వద్దకు వచ్చే పారిశుధ్య కార్మికులకు మాత్రమే అందజేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ వెంట శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

అన్న క్యాంటీన్ల పనుల పర్యవేక్షణ

నగరపాలక సంస్థ కమిషనర్ భావన గురువారం సంత చెరువు వద్ద ప్రతిపాదించిన అన్నా క్యాంటీన్ పనులను పరిశీలించారు. ఎస్ఈ పి.సత్యకుమారి పనుల ప్రగతిని కమిషనర్‌కు వివరించారు. ఈనెల 15వ తేదీ నుంచి క్యాంటీన్లను ప్రారంభించాలన్న ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో పనులన్నీ ఐదో తేదీ కల్లా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులను ఆదేశించారు.

గ్రీవెన్స్ సమస్యపై క్షేత్రస్థాయి పరిశీలన



కొమరగిరి లే అవుట్‌లో అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ భావన

కాకినాడ: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా వచ్చిన ఓ సమస్య పరిష్కారంపై నగరపాలక సంస్థ కమిషనర్ భావన గురువారం క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలనకు వెళ్లారు. కొమరగిరి లే అవుట్ పరిధిలోని ఓ మూడు ఎకరాల రైతు తన చేనుకు నీరందడం లేదని, సమీపంలో ఉన్న ఇరిగేషన్ కెనాల్ ద్వారా నీరందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై వాస్తవ పరిస్థితిని పరిశీలించేందుకు కమిషనర్ భావన అధికారులతో కలిసి కొమరగిరి లే అవుట్ ప్రాంతాన్ని సందర్శించారు. వచ్చిన ఫిర్యాదును స్వయంగా పరిశీలించి అధికారులతో చర్చించారు. కమిషనర్ వెంట నగరపాలక సంస్థ సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.సత్యకుమారి, ఈఈ మాధవి, ఏఈ రమేష్ బాబు తదితరులు ఉన్నారు.

తల్లిపాల ప్రయోజనాలపై అవగాహన

- ఆర్ఎంసీ కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో వారోత్సవాలు
- ఏడో తేదీ వరకు నిర్వహణ



తల్లిపాల ప్రాధాన్యాన్ని వివరిస్తున్న ఆర్ఎంసీ కమ్యూనిటీ మెడిసిన్ విద్యార్థులు

కాకినాడ క్రైం: ఆరోగ్య అవగాహనే లక్ష్యంగా ప్రజాక్షేత్రంలో పర్యటిస్తున్న కాకినాడ రంగరాయ వైద్య కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ విభాగ బృందం తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం నుంచి ఆ బృందం తల్లిపాలపై అవగాహన కల్పిస్తోంది. ఈ నేపథ్యంలో కాకినాడ, రామేశ్వరంలో డిపార్ట్‌మెంట్ వైద్యులు, వైద్య విద్యార్థులు పర్యటించారు. పలువురు బాలింతలు, గర్భిణులతో మమేకమయ్యారు. గురువారం నుంచి ఈ నెల 7వ తేదీ వరకు తల్లి పాల వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. స్థానిక అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల ప్రాధాన్యాన్ని వివరిస్తూ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బిడ్డకు పాలిచ్చే విధానం, ఏ వయసు వరకు ఇవ్వాలి, ఎందుకు ఇవ్వాలి, తల్లి పాలివ్వడం వల్ల మాతా శిశువులకు కలిగే సంయుక్త ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ముర్రుపాల ప్రాధాన్యతనూ వివరించారు. రోగ నిరోధక శక్తి పునరుద్ధరించడంలో తల్లిపాల పాత్రను సామన్యులకు అర్థమయ్యేలా ప్రజంటేషన్ల ద్వారా వివరించారు. కుటుంబ దత్తత పేరుతో డీఎంఈ, ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్‌ల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో అకడమిక్ వైస్ ప్రిన్సిపాల్, హెచ్‌వోడీ డాక్టర్ దేవీ మాధవి, కమ్యూనిటీ మెడిసిన్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ రుక్మిణీదేవి, డాక్టర్ కె.హరీష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎల్.సౌమ్య, డీసీఎస్‌లు పి.శ్రీనివాస్, డాక్టర్ సతీష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీ గౌరీ, అంగన్వాడీ వర్కర్ సుభద్ర, ఏఎన్ఎం వరలక్ష్మి, ఆశా కార్యకర్తలు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

వర్సిటీ అభివృద్ధికి సమష్టిగా కృషి

నన్నయ ఇన్‌చార్జి వీసీ ఆచార్య శ్రీనివాసరావు



ఎంఎస్ఎన్ క్యాంపస్‌లో పర్యటిస్తున్న ఇన్‌చార్జి ఉప కులపతి ఆచార్య శ్రీనివాసరావు

కాకినాడ రూరల్: స్థానిక ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎంఎస్ఎన్ క్యాంపస్ ప్రాంగణాన్ని గురువారం ఇన్‌చార్జి వైస్ చాన్సెలర్ ఆచార్య వై.శ్రీనివాసరావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీకి సేవలందించడం మంచి అవకాశంగా భావిస్తున్నట్లు తెలిపారు. చేసే వృత్తిలో నిజాయితీగా ఉంటే పదవులు వాటంతట అవే వస్తాయని, ఎవరి కర్తవ్యాలను వారు నిర్వర్తించి విద్యార్థుల భవిష్యత్‌కు, యూనివర్సిటీ అభివృద్ధికి పని చేయాలని అధ్యాపకులకు సూచించారు. అనంతరం క్యాంపస్‌లో జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలను, తరగతి గదులను, వివిధ విభాగాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.ప్రశాంతి శ్రీ, ప్రొఫెసర్ ఎం.కమల కుమారి, డాక్టర్ ఎం.పోచయ్య తదితర విభాగాతిపతులు అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

మాతృత్వం మురిసేలా

- సేవే పరమావధిగా అన్నదానం
- వినూత్న సేవలో మన పెద్దాపురం ఫేస్‌బుక్ టీం



ఆసుపత్రిలో బల్లపై కూర్చుని భోజనం చేస్తున్న గర్భిణులు



పెద్దాపురం ఏరియా ఆసుపత్రిలో గర్భిణులకు భోజనం వడ్డిస్తున్న ఫేస్‌బుక్ టీం సభ్యులు

పెద్దాపురం: తల్లికి పట్టెడన్నం పెట్టలేని స్థితిలో నేటి తరం ఉన్న ఈ రోజుల్లో మేమున్నామంటూ ముందుకు సాగుతోంది ఆ యువబృందం.

యువతంతా సమూహంగా ముందుకు సాగుతూ.. తమ వంతు సాయం అందజేసి తమ ఆలోచనకు రూపకల్పన చేశారు. దీంతో ప్రతి బుధవారం గర్భిణి, తల్లులకు మాతృత్వం పేరిట అన్నదానం చేస్తూ సేవే పరమావధిగా ముందుకు సాగుతున్నారు 'మన పెద్దాపురం ఫేస్‌బుక్ టీం'.

వేడివేడి భోజనం, పౌష్టికాహారం

పెద్దాపురం ఏరియా ఆసుపత్రి పరీక్షలు చేయించుకునేందుకు వచ్చే గర్భిణులకు ప్రతి బుధవారం మాతృత్వం పేరుతో ఫేస్‌బుక్ టీం సభ్యులు భోజనంతో పాటు పౌష్టికాహారాన్ని అందించాలని నిర్ణయించింది. దీని కోసం ప్రత్యేకమైన వంట గదిని ఏర్పాటు చేసింది. గర్భిణులకు అందించే ఆహారంలో పప్పులు, కూరగాయాలు, స్వీట్లు, పండ్లు, డ్రై ఫ్రూట్స్‌తో హైప్రోటీన్ ఫుడ్‌ను అందిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు.

20 వారాలుగా నిరంతరాయంగా..

20 వారాలుగా యువబృందం సుమారు రెండు వేల మందికి భోజన ఏర్పాట్లు చేశారు. పెద్దాపురం ఏరియా ఆసుపత్రి పరిధిలో గండేపల్లి, జగ్గంపేట, రంగంపేట, ఏలేశ్వరం తదితర మండలాల నుంచి గర్భిణులు ప్రతి వారం చికిత్సకు వస్తుంటారు. ప్రతి వారం సుమారు 150 మంది నుంచి 200 మంద వరకు భోజన ఏర్పాట్లు చేస్తున్నారు.

చాలా ఆనందంగా ఉంది



ప్రతి నెలా ఆసుపత్రిలో భోజనం చేయడం చాలా ఆనందంగా ఉంది. ప్రతి నెలా బుధవారం పరీక్షలకు వచ్చేటప్పుడు చాలా సమయం పడుతుంది. భోజనం సమయం అయినా ఎక్కడా తినే వీలుండేది కాదు. అటువంటి తరుణంలో మాతృత్వం పేరుతో మన పెద్దాపురం ఫేస్‌బుక్ టీం మంచి సేవలందిస్తోంది.

– సంధ్యారాణి, గర్భిణి, కాట్రావులపల్లి, జగ్గంపేట

తల్లి రుణం తీర్చుకోవాల్సిందే



జన్మనిచ్చిన తల్లి రుణం ప్రతి బిడ్డా తీర్చుకోలేరు. అమ్మకు ఎంత సేవ చేసినా ఆమె రుణం తీర్చలేనిదే. అటువంటి తల్లికి ఏం చెయ్యాలి? నా తల్లి ఒక్కరికే కాదు అందరూ తల్లులకు పట్టెడన్నం పెడితే ఉండే సంతృప్తి వర్ణనాతీతం. అందుకు యువత అందరం కలిసి ప్రతి వారం బిడ్డలకు జన్మనిచ్చే తల్లులకు భోజనం పెట్టాలనే ఉద్దేశంతో మాతృత్వం పేరిట ఈ కార్యక్రమం కొనసాగిస్తున్నాం.

– నరేష్ పెదిరెడ్డి, మన పెద్దాపురం ఫేస్‌బుక్ టీం అడ్మిన్, పెద్దాపురం

పఠన సామర్థ్యాన్ని పెంచుకోవాలి

ఎంఈఓ–2 పుల్లయ్య



ఉప్పరగూడెం పాఠశాలలో విద్యార్థుల పఠనా సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ పుల్లయ్య

సామర్లకోట: విద్యార్థులు రీడింగ్ ఎబిలిటీపై శ్రద్ధ చూపాలని మండల విద్యాశాఖాధికారి–2 పి.పుల్లయ్య అన్నారు. మండల పరిధిలో ఉప్పర గూడెం జిల్లా పరిషత్తు హైస్కూల్‌ను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తకాలలోని ప్రతి పాఠ్యాంశాన్ని చదవడంతో పాటు పాఠ్యాంశంపై పట్టు సాధించాలన్నారు. మేథమెటిక్స్ ఫండమెంటల్ ఆపరేషన్‌ను ఆయన పరిశీలించారు. పాఠశాలలో జరిగే ఎస్ఎంసీ ఎన్నికల పట్ల విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన పెంచాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని హెచ్ఎంకు సూచించారు. పాఠశాలలో చదువుకునే విద్యార్థుల తల్లిదండ్రులు మాత్రమే ఎన్నికల్లో పోటీ చేయాలని చెప్పారు. ఎన్నికలల్లో రిజర్వేషన్లు తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. ఈ మేరకు మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన పరిశీలించారు. హెచ్ఎం భాస్కర్ కుమార్ ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.